బీ ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. ఈ ఫలితాలపై సందేహాలు ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి, ఈ నెల 28వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు కావాలంటే ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

27 నుంచి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షా' తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

ఎఫ్‌టీఎల్ సమస్యలను పరిష్కరిస్తాం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- లింగోజిగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

లింగోజిగూడ డివిజన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 8 : లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్కు కాలనీలో ఎఫ్‌టీఎల్ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ డివిజన్‌లోని గ్రీన్‌ఫార్కు కాలనీ, శ్రీరాంనగర్ కాలనీలో రూ. 1.27 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల క్రితమే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో సమావేశమై సమస్యలను వివరించామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. శంకుస్థాపన చేసిన వెంటనే అధికారులు పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, తిలక్ రావు, రాకేశ్, అశీష్, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు జగన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మధుసూదన్, అంజయ్య గౌడ్, రాంచందర్‌తో పాటుగా పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి



కరపత్రాలను చూపిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 8 : అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. గురువారం హయత్‌నగర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పేదలు, అట్టడుగు వర్గాలకు చేయూత, రైతు సంక్షేమానికి భరోసా, నారీ శక్తికి నూతనోత్తేజం, ప్రధాన మంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన వంటి పథకాలను పేద, మధ్య తరగతి ప్రజల కోసం కేంద్రం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రంగారావు, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు అప్పారావు, నాయకులు బండారి భాస్కర్, గోవిందచారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం

మాట్లాడుతున్న మహిళా బీజేపీ పాలసీ రిసెర్చ్ విభాగం జాతీయ ఇన్‌చార్జి కరుణగోపాల్ వర్తకవి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 8: మహిళలు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు చాలా ఉన్నాయని మహిళా బీజేపీ పాలసీ రీసెర్చ్ విభాగం జాతీయ ఇన్‌చార్జి కరుణగోపాల్ వర్తకవి తెలిపారు. మహిళలకు వ్యాపార అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని కోవే సంస్థ ఆధ్వర్యంలో గురువారం నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరుణగోపాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది మహిళలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ మీద శిక్షణను ఇస్తూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. వ్యాపార అవకాశాలపై మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఎంట్రెపెన్యూర్స్‌గా ఎదిగే మహిళలకు కోవే సంస్థ బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు నిర్వాహకురాలు కాలంశెట్టి లయ, కోవే సంస్థ ప్రతినిధులు జ్యోత్స, చందు, కల్పన, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్యామల, వీణ, సుజాత, సాయిసుధ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

బడంగ్‌పేట, ఫిబ్రవరి8: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక తెలిపారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దావూద్ ఖాన్ గూడలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనర్ ఆఫ్ కాలేజీ యేట్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో ఎంఎస్ ఆఫీస్, ప్రోగ్రాం ఇన్ ఫైతాన్, ఫీవర్ బీవై, కమ్యూనికేషన్ స్కిల్, జాబ్ రెడినెస్ స్కిల్ వంటి వాటిపై విద్యార్థులకు పదిరోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. లర్నింగ్ లింక్ ఫౌండేషన్ సంస్థ, డీఎల్ టెక్నాలజీతో అను సంధానం చేస్తూ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. అనుకున్న రంగాలలో రాణించాలంటే విద్యార్థులు సాధన చేయాలన్నారు. నేర్చుకున్న అంశాలను పదే పదే నెమరు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చందోజిరావ్, డాక్టర్ కరీముల్లా కో, కోర్డినేటర్లు డాక్టర్ కిరణ్ మై, రాంగోపాల్ రెడ్డి, కృష్ణవేణి, తనూజా,రాజేశ్వరి, సుస్మిత, శ్రీనివాస్, సురేశ్, ఆనంద్, దీపిక కళ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో సహకరించాలి

పలు పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సూరజ్ కుమార్

కందుకూరు. ఫిబ్రవరి 8 : నియోజకవర్గంలో ఓటరు నమోదు కార్యక్రమంలో నాయకులు సహకరించాలని ఆర్‌డీవో సూరజ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో తుది జాబితాను విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన నాయకులు సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు తుది జాబితా ప్రకారం 5 లక్షల 55వేల 976మంది ఓటర్లు నమోదు కాగా, 511పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. తుది జాబితా అనంతరం నేటి నుంచి కూడా ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. బీఎల్‌ఓలు రాజకీయ పార్టీల నాయకుల వద్ద ఓటరు లిస్టులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. తమ పేర్లను పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచిన ఓటర్ లిస్టుల్లో పరిశీలించుకోవాలని కోరారు. ఏఓ జ్యోతి, ఎన్నికల డీటీ శేఖర్, సిబ్బంది వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల పనులు పూర్తి చేయాలి

తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణ పనుల విషయమై చర్చిస్తున్న డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ

మలక్‌పేట, ఫిబ్రవరి 8: పాత మలక్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ వాటర్ వర్క్స్ జీఎం ఖాదర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో జీఎం ఖాదర్, డీజీఎం షీలారాణి, పాత మలక్‌పేట, మూసారాంబాగ్ డివిజన్ల ఏఈలు హష్మత్ అలీ, చంద్రునాయక్‌లతో సమావేశమైన ఆయన, పెండింగ్‌లో ఉన్న పనులపై వివరంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనుల కారణంగా డివిజన్‌లోని అనేక కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తిచేసి కాలనీవాసులకు వినియోగంలోకి తేవాలని ఆయన సూచించారు. నిర్మాణ పనుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా తన దృష్టికి తెస్తే ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అన్సారీ (ఫైల్)

సైదాబాద్, ఫిబ్రవరి 8 : వ్యక్తి అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుల్తాన్ అన్సారీ జీవనోపాధి కోసం నగరానికి వచ్చి సైదాబాద్ ఫర్హా కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కాగా భార్యా, భర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన అన్సారీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

సైదాబాద్ డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం పిల్లిగుడిసెల బస్తీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, సకాలంలో పనులను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మలక్‌పేట ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు. – సైదాబాద్, ఫిబ్రవరి 8

క్యారమ్ చాంపియన్ ఆదిత్యకు సత్కారం

ఆర్కేపురం, ఫిబ్రవరి 8 : ఆర్కేపురం డివిజన్ అల్కాపురి భవన్‌లో ఎస్ఆర్ మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో 12వ జాతీయ స్థాయి ఓపెన్ క్యారమ్ టోర్నమెంట్స్ నిర్వహించారు. ఈ పోటీలో నేషనల్ చాంపియన్ శ్రీనివాస్‌తో జరిగిన పోటీలో తెలంగాణ రాష్ట్ర కార్యమ్ చాంపియన్ ఆదిత్య విజయం సాధించారు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక సేవా వేత్త చిలుక ఉపేందర్‌రెడ్డి ఆదిత్యను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జాతీయ స్థాయి కార్యమ్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. నాగోల్ సుధాకర్‌చారి, భరద్వాజ, రామ చంద్రారెడ్డి, రాజగోపాల్, వినయ్, విజయ్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, పగిళ్ల పురుషోత్తం, విప్లవ్, సంతోష్, ప్రభ, రాము తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

టైలరింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఎం.ఏ.సలాం షాహీద్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 8: మహిళా సాధికారత కోసం ఎంఐఎం పార్టీ కృషి చేస్తుందని చావునీ డివిజన్ కార్పొరేటర్ ఎం.ఏ.సలాం షాహీద్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని గుడ్డిబావోలీ కమ్యూనిటీ హాల్, ఆజంపురా డివిజన్‌లో ఫహిల్వాన్ హోటల్ లైన్ లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో సలార్–ఏ–మిల్లత్ టైలరింగ్, బ్యూటీషియన్ ట్రైనింగ్ సెంటర్‌లను డివిజన్ కార్పొరేటర్ ఎం.ఏ.సలాం షాహీద్, ఎంఐఎం నాయకుడు షేక్ మొహియుద్దీన్ అబ్రార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట నియోజకవర్గం ఎంఐఎం పార్టీ మహిళా ఇన్‌చార్జి నాజిమా, టైలరింగ్ సెంటర్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలి

కందుకూరు. ఫిబ్రవరి 8 : సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్ సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీంలాల్ పవార్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 15న సేవాలాల్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొర్ర రాజు నాయక్, బాణావత్ బాబు నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్, నరేందర్ నాయక్, శ్రీను నాయక్, ఉపేందర్ నాయక్, మల్లేశ్ నాయక్, బిక్కు నాయక్, చత్రునాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సేవాలాల్ నాయకులు

మహిళల్లో చైతన్యం దిశగా కృషి

సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

ఉప్పల్, ఫిబ్రవరి 8 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హబ్సిగూడలో గురువారం తెలంగాణ మాదిగ మహిళా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు మేడి పాపయ్య, మాజీ అడిషనల్ సెక్రటరీ సుభద్ర హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ మహిళల్లో చైతన్యం దిశగా కృషి జరుగాలన్నారు. మాదిగ మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమంలో తగిన అవకాశాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ మహిళలు సంఘటితమై చైతన్యంతో రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత రాజలింగం, డా.మేడి రమణ, రుక్కమ్మ, లక్ష్మి, డా.అన్నపూర్ణ, రేణుక, లత, మహాలక్ష్మి, కోమల, అమృత, జ్యోతి, అంజమ్మ, చామంతి, జయ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

కందుకూరు. ఫిబ్రవరి 8: మండల పరిధిలోని దాసర్లపల్లిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. చండీ ఉపాసకులు రేవెల్లె రాజుశర్మ ఆధ్వర్యంలో గురువారం దివంగత జనార్దన్ శర్మ వ్యవసాయ క్షేత్రంలో ఉదయం కుంకుమార్చాలను నిర్వహించిన అనంతరం వివిధ రకాల హోమాలు నిర్వహించారు. అనంతరనం ఈ మాసం ప్రత్యేకంగా మహాలక్ష్మి హోమాన్ని నిర్వహించారు. హోమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ, జూనియర్ కాలేజీల భవన నిర్మాణ పనులు పరిశీలన



భవనం మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 8: ఛావునీ డివిజన్ లోని చంచల్‌గూడ డిగ్రీ, జూనియర్ కాలేజీల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల పరిశీలించారు. విద్యా శాఖ ఇంజినీరింగ్ విభాగం డీఈ, ఏఈ తో కలిసి రెండు బిల్డింగ్‌లను పరిశీలించారు. పనుల పురోగతి పై ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ విద్యావ్యాప్తికి కృషి చేస్తుందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న జూనియర్ కాలేజీ భవనం స్థానంలో కొత్తగా బిల్డింగ్ నిర్మించేందుకు నిధులను మంజూరు చేయించామన్నారు. పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో డిగ్రీ, జూనియర్ కాలేజీలు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా నిర్మాణాలను పూర్తి చేస్తున్నారన్నారు.ఈకార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 8: కాలనీల్లో అస్తవ్యస్తంగా మారిన రోడ్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి కాస్మోపాలిటన్‌కాలనీ, విటల్ ఎన్‌క్లేవ్, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనేది ప్రజలు గ్రహించాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు భూపాల్ రెడ్డి, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, సత్తయ్య, జగదీశ్‌యాదవ్, ఖాసిం, శ్రీనివాసరావు, రమేశ్, శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పక్కన చెత్త వేయొద్దు

కాలనీల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. గురువారం డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త ఎక్కడ పోగవుతుందో చూసి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఖాళీ స్థలాలు, రహదారుల పక్కన చెత్త వేయవద్దన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. – వనస్థలిపురం, ఫిబ్రవరి 8

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలిస్తున్న పోలీసులు

సైదాబాద్, ఫిబ్రవరి 8 : అనుమానాస్పద స్థితిలో మూడంతస్తుల భవనంపై నుంచి కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఎన్ రెడ్డి నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లలిత్ (25), నయన భార్యాభర్తలు. జీవనోపాధి కోసం నగరానికి వచ్చి చంపాపేట ఎస్ఎన్ రెడ్డి గార్డెన్ పక్కనే ఉన్న డీ–అల్పాబేట్ రూమ్స్ లాడ్జి బిల్డింగ్ వాచ్ మెన్‌గా లలిత్ పనిచేస్తున్నాడు. భవనం పెంట్‌హౌస్‌లో నివాసముంటూ ఇద్దరు అక్కడే పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి భార్యా, భర్తల మధ్య గొడవ జరగడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. చంపాపేటలోని ఓ వైన్స్‌కు వెళ్లి మద్యం తెచ్చుకొని బిల్డింగ్ పై భాగంలో ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి మద్యం తాగి వాటర్ ట్యాంక్ నుంచి దిగే క్రమంలో మద్యం మత్తులో అక్కడి నుంచి ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. సీసీ కెమెరాల పుటేజ్‌లను సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్న నాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ ఘన్సీరాం దర్యాప్తు చేస్తున్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

రామంతాపూర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌లో నివాసముంటున్న స్వర్ణప్రియ వివాహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్వ బాబు యా దవ్ గురువారం రూ. 5 వేలు, వస్త్రాలను అమ్మాయి తల్లికి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు జానకి పాల్గొన్నారు. - రామంతాపూర్, ఫిబ్రవరి 8

మురికివాడల అభివృద్ధికి కృషి

రామంతాపూర్, ఫిబ్రవరి 8: మురికి వాడల అభివృద్ధికి కృషి చేస్తానని రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. గురువారం డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. మురికి వాడల అభివృద్ధిలో భాగంగా నెహ్రూనగర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. నెహ్రూనగర్‌లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగమణి, ఏఈ శ్వేతారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పాల్గొన్నారు.

ఉప్పల్ ఓటర్లు 5,29,416

ఉప్పల్, ఫిబ్రవరి 8 : ఉప్పల్ నియోజకవర్గ ఓటర్ల జాబితాను గురువారం అధికారులు విడుదల చేశారు. అసెంబ్లీ పరిధిలోని కాప్రా, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 529416 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కాప్రా సర్కిల్ పరిధిలోని 236 పోలింగ్ స్టేషన్లుండగా, 308369 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 160130 మంది పురుషులు, 221047 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా ఉప్పల్ సర్కిల్ పరిధిలో 115099 మంది పురుషులు, 105930 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 275229 మంది పురుషులు, 254147 మంది మహిళా ఓటర్లు ఉ